# బొరుసు

ఐదయ్యేసరికి మెలకువ వచ్చేసింది రావుకి. లేచి లైటు వేశాడు. వెలుతురు మొహాన్ని పడగానే మెలకువ వచ్చేస్తుందంటుంది యశోద. ఆవిడతో పని లేకపోయినా లైటు అలవాటుగా వేస్తూ ఉంటారాయన.

షూస్ తొడుక్కుని, అనుసరంగా సొరుగులు అటు ఇటూ లాగి, తలుపులు వేసి, యశోద పూర్తిగా నిద్ర లేచి ఆవులిస్తూ కూర్చున్నాకనే గది దాటటం ఆయనకు అలవాటు. ఓ గంట వాకింగ్ చేసి తిరిగి వచ్చేసరికి యశోద వరండా చివరకి చేరి పేపరు చూస్తూ ఉంటుంది. ఎక్కడలేని చికాకు వచ్చేస్తుందాయనకు. కాఫీతోపాటు ఫ్రెష్‌గా మడతలు తీసి పేపర్ చదివితేనే ఆయనకు నచ్చుతుంది.

ఈ లోపల్లో... ఓ... కొంపలు ముంచుకుపోయినట్లు ఆ రాజకీయాలన్నీ ఈవిడ తిరగేస్తుంటుంది.

పైగా ఆ విషయాలన్నీ తనతో వర్ణించాలని మొదట్లో మహా ఉత్సాహ పడిపోయేది.

తరవాత్తరవాత ఆవిడే ఎందుకో మానుకొంది. అయినా ఆవిడతో ఏం చర్చిస్తాం?

కాసేపు మంచంమీద కూర్చున్నాక వాకింగ్‌కి వెళితే ఉచితంగా ఉండదేమోననిపించింది రావుకి. హాల్లోంచి వసంత ఏడుపు వినబడుతోంది. తలుపులు తీసుకుని బయటకు వచ్చాడు రావు. చిన్న స్టూలు మీద కూర్చుని వసంత మొహం చేత్తో కప్పుకుని ఏడుస్తోంది. రోజూ ఈవేళ్టికి ఆ అమ్మాయి అక్కడే కూర్చుని సాధన మొదలుపెట్టేది. ఆ అమ్మాయి కాళ్ళ దగ్గర నేల మీద బోర్లా పడుకుని ఉన్నాడు రమణ. అప్పుడే పేపరు వచ్చినట్లుంది. నేల మీద కొట్టుకుంటోంది అది. కొంచెం చిరాకొచ్చింది రావుకి కొడుకు మీద. ఆ నేల మీద ఆ పిల్ల కాళ్ళ దగ్గర దాసోహం అని పడుకోకపోతే కాస్త మర్యాదగా ఏడవచ్చు గదా. అసలు ఈ ఇంట్లో మనుషులందరూ అంతే. తిరగేసి తయారైనట్లుంటారు. అందుట్లో ఈ రవణగాడు ఫస్ట్. తనతో అసలు మాట్లాడడు. అసలా వంటిల్లు దాటి వస్తే కదా! పొద్దుట తను వాకింగ్‌కి వెళ్ళి వచ్చేసరికి యశోద, వసంత వంటింట్లో చేరతారు. అక్కడ వీడు తయారు. ఏవిటో వాళ్ళకు అడ్డాలడ్డాలు పడి చాకిరీ చేస్తుంటాడు. పోనీ వసంత కోసమేమో అనుకొనేందుకు లేదు. వాడికి బుద్ధి తెలిసినప్పటి నుంచి తల్లి వెంట అట్లాగే తిరుగుతుంటాడు. ఆవిడ వొంటరితనం పట్ల వాడికి జాలిట. తనతో ఈ విషయమై ఎన్నోసార్లు తగవుకి దిగాడు. ఆవిడతోనే కబుర్లు చెప్పాలంటే, ఆవిడ వెనకాలే సినిమాలు షికార్లకు తిరగాలంటే తనకెలా కుదురుతుంది.

కింద కొట్టుకొంటున్న పేపర్ తెచ్చుకోవాలని, అర్జంటుగా ఓ కప్పు కాఫీ తాగాలని అనిపించింది రావుకి. పేపర్‌లో సంతాప సందేశాలు వచ్చే ఉంటాయి. ఇంత టెన్షన్‌లోనూ ఆయన పేపర్‌ను అశ్రద్ధ చేయలేదు. తన తెలివితేటల పట్ల తనకే ఎంతో గౌరవం కలిగింది రావుకి. రమణ తోటివాడే కదా సుబ్రహ్మణ్యం. ఎంత తెలివైన కుర్రాడు. విషయం తెలియగానే టిఫిన్ పొట్లాలతో సహా పరుగెత్తుకొచ్చాడు.

ఎంత బ్రతిమిలాడినా ఈ రమణ అక్కడి నుంచి కదలి రానే లేదు. పిల్లలతోపాటు తనూ బాధ్యత లేకుండా కూర్చుంటే ఎలా. తనకు తప్పుతుందా. యశోద ఎంతో పేరున్న సోషల్ వర్కర్, లెక్చరర్. టౌన్‌లో ఎన్నో ఆర్గనైజేషన్స్‌లో అడ్వయిజరీ కమిటీ మెంబరు. సంతాప సందేశాలు అన్నీ తనే స్వయంగా చాలా పొయిటిక్‌గా రాసి ఇచ్చాడు. ఫ్యామిలీ ఆల్బమ్‌లో నాలుగైదు ఫొటోలు సుబ్రహ్మణ్యం ఎంచి తీసుకున్నాడు. అన్ని పనుల్లా ఫోన్ల మీదే జరిగిపోయాయి. ఈలోగా వాళ్ళ అమ్మా, నాన్నని తీసుకొని వసంత గదిలోకి వచ్చింది. టిఫెన్ ప్లేట్లూ అవీ చూసి ఆ అమ్మాయి మొహం ఎంత ఆశ్చర్యంగా పెట్టిందో. సుబ్రహ్మణ్యం బలవంతం చేశాడు మరి. ఇంతలో రమణ దిగాడు. ఆఫీస్ టూర్ కోసం బాంబే వెళ్ళినవాడు ఎంత ఫ్లయిట్‌లో తిరుగు ప్రయాణం అయినా పది గంటలు పట్టింది. వాడు ఫ్లయిట్‌లో బయలుదేరాడనీ, జర్నీ అంతా పాపం కళ్ళనీళ్ళతో చేస్తూ వస్తున్నాడని సుబ్రహ్మణ్యంతో చెప్పినా

లేదా అని రావు కాసేపు ఆలోచించాడు. ఎదురుగా టేబుల్ మీద పూల దండలతో తనూ యశోద ఉన్న ఫొటో కనిపించింది రావుకి. తను హుందాగా ఉన్నానని గుర్తించాడు రావు. కొంచెం పళ్ళెత్తుగా, సన్నగా తల దువ్వుకుని చిన్న ముడి చుట్టుకున్న యశోదలో గొప్ప అందం లేదనిపించింది రావుకి. నాలుగైదుసార్లు ఆ ఫొటో వంక దీక్షతో చూశాడు రావు. రంగు వేసుకున్నా మెరుస్తున్న జుట్టు, అందంగా కత్తిరించిన మీసాలు, టక్ చేసుకొన్న తీరు తను బాగా కుర్రాడిలా ఉంటాడనిపించింది రావుకి.

సందేహం లేదు. ఢిల్లీ సమ్మేళనంలో కలిసిన సునీత తన ఉత్సాహం, చొరవ చూసి తనకింకా పెళ్ళి కాలేదనుకుంది. పైగా తనూ చెప్పలేదనుకో. ఈ విషయం దగ్గరే తన స్నేహం మానేసిందా అమ్మాయి. పెళ్ళయిందని ఎవడైనా ఆడాళ్ళకు మల్లే మంగళసూత్రాలు తగిలించుకుని తిరుగుతారా?

రావుకి తలనొప్పి తగులుకుంది. కాఫీ... కాఫీ ఎల్లా?

తన పనులు సిస్టమాటిక్‌గా ఉండాలి. ఏవిటో సంవత్సరాల తరబడి అలా అయింది. ఆరుగంటలకు కాఫీ... గంట తరవాత స్నేక్స్. తొమ్మిదింటికి భోజనం. మధ్యాహ్నానికి టిఫిన్. యశోద కాలేజీకి వెళ్ళే లోపునే అన్నీ సిద్ధమై పోయేవి. పనిపిల్లతో టైమింగ్స్ కుదరవని అన్నీ తనే అరేంజ్ చేసుకునేది. తను ముందే చెప్పాడు. తన కెరీర్ తనకు ముఖ్యం. మీ అరేంజ్‌మెంట్లు మీరు చేసుకోండి, నా పనులకు అడ్డం రావద్దని. పిల్లలు, వాళ్ళ ఇబ్బందులు చదువులు దాదాపుగా తను జోక్యం చేసుకోనట్లే. సాహిత్యాకాశంలో వండర్ స్టార్‌గా తను వెలిగిపోవడం వాళ్ళకు మటుకు గొప్ప కాదూ.

ఉన్నట్టుండి రావుకి తల్లి గుర్తుకొచ్చింది. ఈవిడేమైంది? ఆయన గబగబా కిచెన్ పక్కగా ఉన్న రెండో బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. ముసలామె మంచం మధ్యలో కూర్చుని ఉంది. పాలు తాగింది గాబోలు గ్లాసు రెండు చేతుల్తో పట్టుకుని ఏవిటో ఆలోచిస్తోంది. 'ఈవిడ సంగతి ఎవరో చూశారు' రావు ఊపిరి పీల్చుకున్నాడు.

'అమ్మా!'

ఈశ్వరమ్మ తలతిప్పి కొడుకు వంక చూసింది. ఏమిటన్నట్టు కళ్ళెగరేసింది. రావుకు ఏం మాట్లాడాలో తోచలేదు. ముసలామె గ్లాసు మంచమ్మీద పెట్టి రెండు చేతులు పైకి చాపి చూపించి గుండెలు కొట్టుకుంది. తల వంచుకొని సన్నగా ఏడవటం మొదలుపెట్టింది. రావుతో ఆవిడ మాట్లాడదు ఎప్పుడూ. సాయంత్రం వేళ రావు ఇంటికి వచ్చేసరికి ముసలమ్మ గది కబుర్లతో గలగలలాడుతుంటుంది. రమణగాడూ, వసంత, యశోద వాళ్ళ తీరిక సమయం అంతా ఆ గదిలోనే పడి ఉంటారు. తనంత సీరియస్ టైపు కాదు వాళ్ళు. వాళ్ళంతా ఏం

మాట్లాడుకొంటారో రావుకి ఎప్పుడూ ఆశ్చర్యమే. తనకయితే వాళ్ళతో కబుర్లేమీ వుండవు. ఫోన్ మోగింది. అటునుంచి సుశీలగారు. ఎలా ఉన్నారని అడుగుతోంది. రావుని తలుచుకొని చాలా బాధ పడ్డానని చెపుతోంది. ఎన్నడూ లేంది రావుకి ఆవిడ ఫోన్ పెట్టేస్తే బావుండునని పించింది. ముందు ఆకలిగా ఉంది. స్నాక్స్, కాఫీ అర్జంటుగా కావాలి. హాల్లో వ్యవహారం చూస్తే వాళ్ళు వంటింటి వైపు వెళ్ళినట్లు కనిపించలేదు. ముందు స్నానం చేసి బయటికి పోయి తరువాత ఆలోచిద్దామనిపించింది. టవల్ ఒక్కటీ లేదు. ఈ వారం రోజుల నుంచి బీరువాలో ఉన్నంతవరకూ అన్నీ వాడేసినట్లే. కనీసం ఉతికిన లుంగీ కూడా లేదు. ఇవన్నీ చూసుకొనే తీరిక తనకెక్కడిదీ? ఆఫీసు నుంచి రాగానే ఓ అరగంటలో ఏదైనా టిఫిన్ తిని కాఫీ తాగేసి హోటల్ శిల్పాకి వెళ్ళిపోవాలి. అక్కడ ఎంతోమంది మిత్రులు కొత్తగా సాహిత్యంలో దిగిన వాళ్ళు, చర్చలు, పార్టీలు, మీటింగ్స్ ఏదో ఒకటి. ప్రతి సాయంత్రం తను బిజీగా ఉన్నట్లే. పైగా ఈ మధ్య 'దీపం' మేగజైన్‌లో పనిచేసే శ్రీవిద్య కవితలు రాయడం మొదలుపెట్టింది. మొదట్లో రిక్వెస్ట్ చేసింది. చదివి తన అభిప్రాయం చెప్పమని. ఆ అమ్మాయితో మాట్లాడుతుంటే గంటలు నిముషాల్లా గడిచిపోతాయి. ఈ మధ్యలో ఉన్నట్టుండి ఆ అమ్మాయి ఉత్సాహం తగ్గిపోయింది. 'సాయంత్రం ఆఫీసులో బిజీ వర్క్ సార్' అంటూ మాట్లాడటం తగ్గించింది. పాపం చిన్నపిల్ల వృద్ధిలోకి రావలసింది. తనే తీరిక చేసుకొని ఆ అమ్మాయి వద్దన్నా ఆవిడ ఆఫీసుకు వెళ్ళి కూర్చుని మరీ ఎంకరేజ్ చేస్తున్నాడు. పాపం అప్పటికీ ఆ అమ్మాయి మొహమాటపడి పోయింది. 'పని చాలా ఉంటుందండీ' అంటుంది. తనకు తెలుసు విద్యలో ఉన్న టాలెంట్ – తనలాంటి మేధావులు పూనుకుంటే తప్ప ఆ అమ్మాయిలాంటి వాళ్ళు వెలుగులోకి రారు. సుబ్రహ్మణ్యం ఫోన్ చేసి మరీ అడుగుతాడు విద్యను. 'ఏమిటండీ మా గురువుగారు డల్‌గా అయిపోతున్నారు మీరు దర్శనం ఇప్పించండి' అంటాడు. చాలా జోవియల్. రియల్లీ చాకు. అందుకే అతన్ని సాహిత్య కళాపరిషత్ అధ్యక్షునిగా చేస్తే ఎటు తిరిగి తనకు ప్రైజ్ తప్పదు. తనకంటే పెద్దవాళ్ళు సిటీలో ఇంకెవరున్నారు?

తల స్నానం చేశాక, మురికి టవల్ వాడుకోవలసి వచ్చేసరికి రావుకి దిగులు వేసింది. ఇలా డిసిప్లిన్‌గా పనులు చేయకపోతే యశోదను ఎప్పుడూ క్షమించలేదు. నోరెత్తదు. ఇంట్లో గొడవలొస్తే ఇంటి వాతావరణం దెబ్బ తింటుందట. పిల్లలు మూడీగా అయిపోతారని నోరుమూసుకొని వినేది. ఇంతట్లో వసంత కాఫీ తెచ్చి ఇచ్చింది.

ఎల్లాగయినా ఈ పిల్ల తెలివైంది. తనతో పెద్దగా మాట్లాడదు. వీళ్ళ నాన్న ఒక కాలంలో పేరున్న సంగీత విద్వాంసుడు. పెరాలిసిస్ వచ్చి కచేరీలు మూలపడ్డాయి. వసంత బాగా పాడుతుంది. రేడియోలో పని. ఆ దరిద్రుల కొంపలోంచి యశోదే వసంతని ఏరి తెచ్చుకుంది. ఇన్నేళ్ళనుంచి వసంత తండ్రికి వైద్యం చేయిస్తూనే ఉంది. తను అప్పటికీ రమణకి చెప్పాడు.

తన ఫ్రెండు     ఆగ్రోషిప్ ఎం.డి. ప్రకాశం లాకియర్. వాడి కూతురు చాలా బావుంటుంది. మిస్ విజయవాడగా ఎన్నికైంది. వెరీ యాక్టివ్. ఆ అమ్మాయిని సజెస్ట్ చేస్తే రమణగాడికి అభ్యంతరమట. దేనికీ! ప్రకాశం జనానికి టోపీ పెట్టాడంటాడు. గొర్రెలు పెంచి, పెట్టుబడి పదింతలు చేసి ఇస్తాం అంటే నమ్మిన ప్రజలది కాదట తప్పు ప్రకాశందంటాడు. గొర్రెలకు రోగం వచ్చి ఫటఫట మని రాలిపోయాయి. వాడేం చేస్తాడు. బిజినెస్‌లో మరి లక్షలెలా సంపాయించాడో అని వీడు లా పాయింట్ తీస్తాడు. జనం నష్టపోతే తప్పు ప్రకాశందా? బిజినెస్ అలాంటిది. రమణ గాడికి వెటకారం. పోనీ ఎవడి పిచ్చి వాడికి ఆనందం. వాడికి వసంతతో రాసిపెట్టి ఉంది. ఈ ఐదేళ్ళుగా వాళ్ళ కుటుంబం కోసం రమణ, యశోద తిప్పలు పడుతూనే ఉన్నారు. తను మటుకు ముందే చెప్పాడు. తన ఇన్‌ఫ్లుయెన్స్ గానీ, డబ్బుగానీ ఇతరుల కోసం ఖర్చు పెట్టనని. ఒకసారి చెప్పాక ఇక వాళ్ళు తన జోలికి రాలేదు. అసలు వాళ్ళ ఆలోచనలూ, వేషాలూ చూస్తేనే తనకు చిరాకు. ఉదయం నుంచి అలా గానుగెద్దుల్లా పనిచేసి ఆవిడ కాలేజికీ, కొడుకూ కోడలూ ఆఫీసుకూ పోతారు. సాయంత్రం మళ్ళా వంటింట్లో చేరతారు. ఇక వీధుల్లో పిల్లల్ని పోగేసుకు రావటం, రాత్రింబవళ్ళు పోలియో సెంటర్లూ ఆరోగ్య కేంద్రాలూ వాళ్ళ బొందలూ, వంద పనులు. పెద్దాడు వాసు పోయాక ఈ పనులు మరింత ఎక్కువయిపోయాయి. వాడూ యశోద కొడుకే. సీనియర్ ఇంజనీర్ కావాలని వాడి తపన. అమెరికాలో సీటు వచ్చిందా ,యశోద తన పి.ఎఫ్. తోసహా తీసి వాడిని సాగనంపింది. రెండోవారంలో వాడి చావుకబురు. రోడ్డు దాటబోయాడట, ట్రక్ కొట్టేసింది. యూనివర్సిటీ వాళ్ళు ఫీజులు అవీ తిరిగి ఇచ్చేశారు. డెడ్‌బాడీ చూడాలని యశోద మంకుపట్టు. అందరూ అది ఖర్చుతో కూడిన వ్యవహారం వద్దన్నారు. బాడీ పోస్టుమార్టం చేసి లోపల రసాయనాలు నింపేసి, ముఖం వరకూ అద్దంలోంచి కనబడేలా అమర్చి పంపుతారు. కార్గో ఫ్లయిట్‌లో రావాలి. సామానులాగా. యశోద సర్వస్వం ఊడ్చింది. చనిపోయిన నెల రోజులకు వాడి శరీరం విమానంలో వచ్చింది. యశోద అలా వెర్రిదానిలా అద్దంలోంచి కొడుకు ముఖం చూస్తూ కూర్చుంది. మట్టూ తెల్లని బట్టల్లోంచి వాడి మొహం నిద్రపోతున్నట్టుగా ఉంది. 'పిల్లల కోసమే జీవితం అంతా కరిగించుకొన్నాను, వాడిని పోగొట్టుకోవడం కంటే తనకు విషాదం లేదని' ఏడ్చింది. వాడిని చూసుకొని చూసుకొని విరుచుకుపడిపోయింది. వాడి పేరిట సేవా సదనం ప్రారంభించింది. ఇక నిరంతరం దాని కోసం కృషి. ఆ ట్రస్ట్‌లో పనిచేయమని యశోద, రమణ ఇద్దరూ అడిగారు. తనకెలా కుదురుతుంది. తను పేరున్న రచయిత. పనులూ, ఉద్యోగం, సాయంత్రం మీటింగ్‌లూ క్షణం తీరదు. పైగా తను చాలా సెన్సిటివ్. వాసు మరణం తనకు పెద్ద షాక్. వాడి మృతిపట్ల తను చలించిపోయి రాసిన కవితలు తనను ఆకాశంలో నిలబెట్టాయి. ఒక శోకం అలా తనను వెంటాడి వేధించింది. యశోద ఆ తరువాత చాలా పాడైపోయింది. ఇటు అమ్మ పనులు, అటు ఉద్యోగం, ఇంట్లో పనులు చాలా కష్టపడేది.

అమ్మ చాలా విచిత్రమైన మనిషి. ఇంట్లో తనున్నా గ్లాసు మంచినీళ్ళు కూడా తనను అడగదు. యశోద కోసం కనిపెట్టుకునుంటుంది. ఆవిడ వస్తూనే చెప్పులు వదిలేసి అత్తగారి గదిలోకి వెళుతుంది. ఇద్దరూ అలా నిర్ఘాంతపోయి కూర్చుని ఉండటం చాలాసార్లు గమనించాడు. వాసు గురించి తలుచుకొంటారనుకొంటా. ఓ గంట అలా వాళ్ళ దగ్గర కూర్చోవాలనిపించినా తనకు తీరికలేదు.

తాగిన కప్పు కాఫీ ఏమయిపోయిందో, రావుగారికి ఆకలి మొదలైంది. హాల్లో వసంత తల్లిదండ్రులతోపాటు రమణ ఫ్రెండ్స్ చేరినట్టున్నారు. వసంత మాటలు వినిపిస్తున్నాయి.

"ఆవిడ మా అమ్మండి... మా అమ్మా, నాన్నా అందరం ఆవిడ బిడ్డల్లాగే ఫీలయ్యేవాళ్ళం. మా నాన్న ఇవాళ ఇలా ప్రాణాలతో ఉన్నారంటే ఆవిడ దయేనండీ. జీతంలో సగం నాన్న మందులకు ఇచ్చేవారావిడ. వంద రూపాయలకు మించిన చీర కూడా ఏనాడూ కట్టుకోలేదావిడ. ఆవిడ మా పాలిట దైవమండీ... దైవం...!"

అమ్మ గొంతు వినవస్తోంది.

"ఇరవై ఏళ్ళనాడు... దాన్ని ఓ మాట అడిగాను. యశోదా ఓపిక అయిపోయింది. నేనింక నా పనులు కూడా చేసుకోలేనేమో... నీ ఉద్యోగం, నా చాకిరి నీకు కష్టమయిపోతాయి. పోనీ నేను నా కూతురి దగ్గరకు వెళ్ళిపోనా!' అని ఒక్కటే మాటందిరా.

"మా అమ్మని నేనం ఎరగనత్తా, రమణా, వాసుతో పాటు నువ్వు నా బిడ్డవనుకొంటానన్నాదిరా. ఎప్పుడో పోతాననుకున్నా. దాని చేతి అమృతం నాకు వెయ్యేళ్ళ ఆరోగ్యం ఇచ్చిందిరా..."

అమ్మ ఇన్ని మాటలు మాట్లాడటం నేనెప్పుడూ వినలేదు. నీరసంతో కళ్లు తిరుగుతున్నాయి.

రెండురోజుల్లో అంతా అప్‌సెట్ అయిపోయింది. తను ఎవరితోనూ పెద్ద స్నేహం ప్రకటించకపోయినా, తన పనులు అయిపోయేవి. తన తిండి, బట్టలు, ఇస్త్రీలు తన రూమ్ శుభ్రత అన్నీ యశోదే చూసేది. సోది కబుర్లు చెప్పద్దనీ, తన్ను అట్టే డిస్టర్బ్ చేయద్దనీ, తన ఫ్రెండ్స్ అంతా మేధావులనీ, వాళ్ళ ముందు వూరికే మాట్లాడి నవ్వుల పాలు కావద్దనీ ఇలా తనే ముందుగా యశోదకు చెప్పేశాడు. లేకపోతే గొడవలైపోవూ. కనీసం తను రాసిన కొత్త కవిత కూడా యశోదకు చూపించడు. ఓ... ప్రతి పదాన్ని గొప్ప విమర్శకురాలిలాగా లాగి చూపెడుతుంటే చిరాకు రాదూ? అదే సుబ్రహ్మణ్యం చూడు. తను రాసిన ప్రతి పదంలో అందం, అర్థం వెతుకుతాడు. వాడు జీనియస్.

రావుకి హఠాత్తుగా కొడుకు, కోడలూ వాలా పెందరాడే ఇల్లు వదులుతారని గుర్తొచ్చింది. తాను స్నేక్స్ తీసుకొంటుంటే వసంత బాక్స్ సర్దుకొని ప్రయాణం అవుతుంటుంది. మరి తన పనులన్నీ ఎల్లా? వారం రోజులుగా ఇబ్బంది పడటం గుర్తు తెచ్చుకుని రావు వాలా బాధపడ్డాడు. కన్నీళ్ళు కూడా వచ్చాయి. యశోద పోయింది. నిజంగానే యశోద పోయింది. పేపర్‌లో ఫొటోలూ ప్రశంసలూ, సంతాప సందేశాలు అల్లా ఉంమ, రేపటి నుంచి తనకెల్లా...?

''ఏమండీ పడుకొన్నారా?''

తలుపు నెట్టుకొని యశోద కాలీగ్ నిరంజన్‌రావుగారు వచ్చారు. రావు కళ్ళు తుడుచుకొని లేచి కూర్చున్నాడు.

'అసలావేళ ఉదయమే యశోదగారు నాకు ఫోన్ చేశారు. స్టూడెంట్ ర్యాలీ గురించి మాట్లాడారు. అరగంటకే ఆవిడ పోయిందని కబురు. నిజంగా షాక్ పోయానంటే నమ్మండి. ఆవిడ ఒక చైతన్యం సుమండీ. ఈ 30 ఏళ్ళగా ఆవిడ లేని ప్రోగ్రామ్ లేదంటే నమ్మండి. కళ్ళనీళ్ళు పెట్టుకోని స్టూడెంటు లేడు...'

వందలాది మంది కుర్రాళ్ళు యశోదను గులాబీ దండలతో ముంచెత్తటం రావు తలుచుకొన్నాడు. నిరంజన్‌రావు మాట్లాడటం వినిపించటం మానేసింది రావుకి. ఆయనకు ఉక్కిరిబిక్కిరిగా ఉంది. కళ్ళజోడు తుడిచి పెట్టుకొంటే డ్రెస్సింగ్ టేబుల్ మీద దుమ్ము స్పష్టంగా కనిపించింది.

నిరంజన్ వెళ్ళాక వసంతని పిలవాలి. ఇదంతా కాస్త సర్దిస్తే తప్ప తనకు ఊపిరాడదు. బొత్తిగా మూడ్ పాడయిపోయింది. ఆరింటికి యశోద సంతాపసభ ఉంది. ఎరేంజ్‌మెంట్స్ ఎలా చేశారో ఏమో! సుబ్రహ్మణ్యం వాకే గానీ వెనక మన డైరెక్షన్ ఉండాల్సిందే. తల్లి గురించి ఏం మాట్లాడినా తను తట్టుకోలేనని రమణ రానన్నాడు. పైగా సభలెందుకంటాడు. తనకి తప్పుతుందా మరి!

★

సుప్రభాతం

**20.2.1997**